క్లుప్తంగా

ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన

నడిగూడెం : మండల పరిధిలోని చెన్నకేశ్వాపురంలో ఆదివారం ఆయుష్మాన్ భారత్ పథకంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ కోఆర్డినేటర్ మేకల నాగరాజు పాల్గొని మాట్లాడారు. అర్హులైన పేదలందరూ ఈ పథకం ద్వారా ఉచితంగా వైద్యం చేయించుకోవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లక్ష్మి, మేకల వెంకటేశ్వరరావు, మిరియాల సత్యనారాయణ, తంగెళ్ల శ్రీను, రమణ, కొండ ఉపేందర్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సుంకరి క్రాంతికుమార్

నేరేడుచర్ల : గరిడేపల్లి మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తూముకుంట్ల శివకు ఆదివారం పట్టణంలో క్రాంతినికేతన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చైర్మన్ సుంకరి క్రాంతికుమార్ రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబానికి చెందిన శివ ఎంబీబీఎస్ చదువుతుండగా తనవంతుగా ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది సుంకరి ప్రదీప్తి, అరిబండి కిరణ్‌కుమార్, నిమ్మగడ్డ సుబ్బారావు, రాంసెట్టి రాంబాబు, జగిని శ్రీనివాస్ తదితరులున్నారు.

నేడు పల్లె దవాఖానా ప్రారంభం

మోతె : మండలంలోని సిరికొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానాను సోమవారం ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ప్రారంభించనున్నట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి హాజరు కానున్నారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేయనున్నారు.


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



సన్మానిస్తున్న మండల నాయకులు

నడిగూడెం : గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని రూరల్ మెడికల్ ప్రాక్టీసనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పానుగోటి భుజంగరావు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామీణ వైద్యుడు సభ్యత్వ రుసుము సమకూర్చుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు గుణగంటి వెంకన్న గౌడ్, వెంకటప్పయ్య, దొంతగాని రవిబాబు, భూతం శ్రీను, సురభి కాంతారావు, ఎరుకల శ్రీశైలం, కృష్ణ, కొత్త ఉపేందర్, వీఎల్ఎన్ గౌడ్, బడిమియా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాపుగల్లులో ఉచిత వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లులో కోదాడ అరుణ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 750మందికి రోగులకు బీపీ, షుగర్‌తో పాటు పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రజలు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ కొండా రాంబాబు, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ గాయత్రి, డాక్టర్ అంబేద్కర్ సిద్ధార్థ, వినీల్, ప్రశాంతి, జగదీష్, నరేందర్, సాగర్, శ్రీకాంత్, భాస్కర్, నాగేశ్వరరావు, మోహన్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని 5, 14వ వార్డుల్లో మున్సిపల్ సాధారణ నిధులతో రూ.లక్ష 37వేల వ్యయంతో ఏర్పాటు చేసిన మంచినీటి పైపులైన్, బోర్లను ఆయా వార్డుల కౌన్సిలర్లు అలక సరితసైదిరెడ్డి, వేమూరి నాగవేణినారాయణలతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఖైరూన్, తులసి, వెంకన్న, కాంతయ్య, అనిల్, శ్రీను, సైదాబి, మహిమ తదితరులున్నారు.

మౌలిక వసతులు కరువు

- జీక్యాతండా డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో విద్యుత్, నీటి సౌకర్యం లేక ఇబ్బందులు
- వసతులు కల్పించాలని కాలనీవాసుల వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



జీక్యాతండాలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం

కోదాడరూరల్ : తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేసింది. అనంతరం వాటిని నిర్మించి కేటాయించారు. కాని ఆ ఇళ్ల సముదాయాల్లో ఎలాంటి మౌలిక వసతులు కల్పించకుండా పంపిణీ చేయడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు మండలంలోని బీక్యాతండా లబ్ధిదారులు. తండాలో ఆరేళ్లకిందట 50డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించారు. వాటిని నాలుగు నెలల కిందట లబ్ధిదారులకు పంపిణీ చేసి పట్టాలను అందజేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఆ ఇళ్ల సముదాయంలో అక్కడి ప్రజలకు కావాల్సిన కనీస వసతులు లేకపోవడంతో వారు సమస్యలతో సతమతమవుతున్నారు.

విద్యుత్, నీటిసమస్యతో ఇబ్బందులు..

డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నిర్మించిన ప్రభుత్వం విద్యుత్, నీటివసతి సౌకర్యాలు కల్పించకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తారని చీకట్లోనే ఉంటూ కొన్ని రోజులు వేచి చూశారు. కానీ వారు పట్టించుకోలేదు. అదే విధంగా నీటి వసతులు కల్పించాల్సి ఉన్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోలేదు. దీంతో చేసేది లేక సొంతంగా కాలనీవాసులు సమీప గ్రామం నుంచి విద్యుత్ వైర్లు లాగి ఓ స్తంభం ఏర్పాటు చేసుకుని పలు ఇళ్లకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకున్నారు. మరి కొందరు వంద నుంచి రెండు వందల మీటర్ల వరకు విద్యుత్ వైర్‌లు కొనుగోలు చేసి ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్ అధికారులు మాత్రం మీటర్లు అమర్చుకోవాలని లేకుంటే విద్యుత్‌ను నిలిపివేస్తామని బెదిరిస్తున్నారే తప్ప విద్యుత్ సౌకర్యం మాత్రం కల్పించడానికి ముందుకు రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అక్కడ నీటి సమస్య కూడా తీవ్రంగా ఉండడంతో సమీప గ్రామంలోకి వెళ్లి బిందెలతో తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఇంటి వద్ద సొంతంగా బోర్లు ఏర్పాటు చేసుకున్నప్పటికీ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో మోటార్లు ఖాళీగా ఉంచాల్సివస్తుందని అంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి డబుల్ ఇళ్ల సముదాయంలో మౌలిక వసతులు కల్పించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

నీటికోసం తండాలోకి వెళ్తున్నాం



మాతండాలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు నీటి వసతి లేదు. ఇంట్లో ప్రతి పనికి నీరు అవసరం. అలాంటిది నీటి సౌకర్యమే కల్పించలేదు. దీంతో నీటికోసం అనేక ఇబ్బందులు పడుతున్నాం. పక్కన ఉన్న తండాలోకి వెళ్లి రోజు బిందెలతో నీటిని తెచ్చుకోవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి నీటివసతి కల్పించాలి.

– భూక్య మంజుల, బీక్యాతండా

దోమలతో ఇబ్బందులు పడుతున్నాం



మా డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద విద్యుత్ సౌకర్యం లేదు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. విద్యుత్ లేకపోవడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. వందల మీటర్ల వైర్లు తెచ్చి తండా నుంచి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకున్నా అది కూడా లోవోల్టేజీ వస్తుంది.

– భూక్య శ్రీను, బీక్యాతండా

త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తాం



లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేశాం. విద్యుత్, నీటి వసతులను ఆయా శాఖల అధికారులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆ శాఖల అధికారులకు తెలిపాము. త్వరలోనే ఆ రెండు సమస్యలు పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– రాము, పీఆర్ ఏఈ, కోదాడ

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

- బొల్లం మల్లయ్యయాదవ్



రామసాని మంజులారెడ్డి దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

మోతె : తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని సిరికొండ, కూడలి గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజాసంక్షేమ పథకాలు నచ్చి బీఆర్‌ఎస్‌లో భారీగా చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షురాలు రామసాని మంజులారెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు బీఆర్‌ఎస్‌లో చేరడం అభినందనీయమన్నారు. వారితో పాటు కూడలి గ్రామానికి చెందిన వార్డుమెంబర్ ఇసరం రాంబాబుతో పాటు బండ్ల మధు, కుశనపల్లి ఉపేందర్, 60కుటుంబాలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శీలం సైదులు, ఏలూరి వెంకటేశ్వరరావు, నవిల రామకోటయ్య, ఆరె లింగారెడ్డి, కొండపల్లి వెంకటరెడ్డి, మిక్కిలినేని సతీష్, నూకల శ్రీనివాసరెడ్డి, రామమూర్తి, వెంకన్న, శివరంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న యాకుబ్

గరిడేపల్లి : నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మోసం చేసిందని సీపీఎం మండల కార్యదర్శి యాకుబ్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని కుతుబ్‌షాపురంలో నిర్వహించిన పార్టీ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నిధులు, నియామకాలు, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని అనుకుంటే తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం మాత్రమే అందలం ఎక్కింది కానీ పేదలకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. దళితులకు మూడేకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వలేదన్నారు. 1200మంది ఆత్మబలిదానంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే దళితుడే సీఎం అని చెప్పిన కేసీఆర్ అధికారంలోకి రాగానే తానే సీఎం అయ్యాడని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ఆకుల అరవింద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ పార్టీ నాయకులు వెంకటేశం, లింగయ్య, నరసయ్య, రామయ్య తదితరులున్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ అందించాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని అమరవరం సబ్‌స్టేషన్ ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు 24గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ రైతులను మోసం చేసిందని ఆరోపించారు. సాగర్ ఆయకట్టు కింద బోర్లు, బావుల కింద సాగు చేసుకున్న రైతులకు విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని అయోమయ స్థితిలో ఉన్నారని అన్నారు. విద్యుత్ లోవోల్టేజీతో మోటార్లు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు తంగెళ్ల వెంకటచంద్ర, నూకల లక్ష్మీనర్సింహ, రైతు సంఘం నాయకులు నర్సింహాచారి, శ్రీనివాసరావు, సత్యనారాయణరెడ్డి, బాలసైదులు, అరవింద, వీరబాబు, శంభిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

పాలకవీడు : బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరుతున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి అన్నారు. మండలంలోని ముసిఒడ్డుసింగారం, యల్లాపురం గ్రామాల నుంచి పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో చేరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యరడ్ల సత్యనారాయణరెడ్డి, తీగల వెంకట్‌రెడ్డి, మునగాల సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్- 1 అభ్యర్థులకు క్షమాపణ చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిలకరాజు శ్రీను

నేరేడుచర్ల : గ్రూప్–1 పరీక్ష రద్దుకు కారణమైన ప్రభుత్వం వెంటనే అభ్యర్థులకు క్షమాపణ చెప్పాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రూప్–1 అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.5లక్షల పరిహారంగా చెల్లించడంతో పాటు ప్రశ్న ప్రతాల లీకేజీలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు ఉపేందర్, మదార్, సురేందర్, భాస్కర్ తదితరులున్నారు.

గ్రూప్- 1 రద్దుకు ప్రభుత్వం బాధ్యత వహించాలి..

గ్రూప్–1 పరీక్ష రద్దుకు తెలంగాణ ప్రభుత్వం బాధ్యత వహించాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా హుజూర్‌నగర్ కన్వీనర్ వాస పల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో నాయకులు సత్తెమ్మ, కరుణాకర్, హుస్సేన్, మరియమ్మ, పావని, పాతిమా, లక్ష్మి, బుచ్చమ్మ, తదితరులున్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే గ్రూప్–1 పరీక్ష రద్దు

హుజూర్‌నగర్ : తెలంగాణ ప్రభుత్వ వైఫల్యంతోనే గ్రూప్- 1 పరీక్ష రద్దయ్యిందని యువజన జనసమితి జిల్లా అధ్యక్షుడు భిక్షం ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో నిరుద్యోగులకు అడుగడుగునా దగాపడ్డారని అన్నారు. గ్రూప్- 1 పరీక్షను కోర్టు మరోసారి రద్దు చేయడంతో నిరుద్యోగులు మానసికమైన వేదనలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రంథాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, నాయకులు

చిలుకూరు : మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయులు కైలాసం వెంకటేశ్వర్లు, మండవ ఉపేందర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. దీంతో ఆదివారం స్థానిక బాపూజీ శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయుల ప్రాత ఎనలేనిదని అన్నారు. అనంతరం జిల్లా ఉపాధ్యాయులుగా ఎంపికైన కైలాసం వెంకటేశ్వర్లు, మండవ ఉపేందర్ దంపతులను కమిటీ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొడారు బాబు, ఎంపీటీసీ బెల్లంకొండ రమణనాగయ్య, గ్రంథాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అంబాల వెంకటి, పిల్లుట్ల కృష్ణయ్య, డీఎల్‌డీఏ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, సొసైటీ చైర్మన్ అలసకాని జనార్దన్, మాజీ ఎంపీపీ కొండా అన్నపూర్ణ, రీడర్స్ ఫోరం అధ్యక్షుడు బోయిళ్ల రాజు, కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇరుగు పిచ్చయ్య

మఠంపల్లి : తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను కార్యకర్తలు విస్తృత ప్రచారం చేసి బీఆర్‌ఎస్ గెలుపునకు కృషిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య అన్నారు. ఆదివారం మండలంలోని దొనబండతండా, భీల్యానాయక్‌దండా, కొత్తండా, బాడవాతండా తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ బూత్‌స్థాయి కమిటీల సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశాల్లో జెడ్పీటీసీ జగన్‌నాయక్, సర్పంచ్ పాండునాయక్, నవీన్‌నాయక్, భరత్‌నాయక్, కోటానాయక్, నాగేశ్వరరావునాయక్, రంగానాయక్, రాజేష్‌నాయక్, నాగునాయక్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

- పలు గ్రామాల్లో వినాయక మండపాల వద్ద అన్నదానాలు, నిమజ్జనాలు

హుజూర్‌నగర్ : పట్టణంలో వినాయక చవితి నవరాత్రులు కొనసాగుతున్నాయి. ఆదివారం 16వ వార్డులో గణేషుడికి కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి ప్రత్యేక పూజలు చేసి అన్నాదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా ఆయా విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదానాలు చేశారు. పలు చోట్ల గణేష్ శోభాయాత్రలు నిర్వహించారు. కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

మోతె : మండలంలోని నామవరం, రాఘవాపురం ఎక్స్‌రోడ్డు గ్రామంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే నలమాద పద్మావతి గణేశ్ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, మధురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

మునగాల : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆయా మండపాలలో కొలువై ఉన్న గణనాధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన ఆదివారం కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్రా సుధారాణి -పుల్లారెడ్డి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం గణేశ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు వై.నవీన్, సభ్యులు సాయి, రాము, గోపాలకృష్ణ, రాజశేఖర్, బాలు, నాగరాజు, సందీప్ పాల్గొన్నారు.

కలకోవలో..

మండలంలోని కలకోవలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మునగాల ఎస్ఐ పి.లోకేష్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంపెల్లి సుజాత, ఉపసర్పంచ్ బెల్లంకొండ చినవెంకన్న, ఎంపీటీసీ గన్నా భవానీ, గ్రామ పెద్దలు మండవ చినసైదులు పాల్గొన్నారు.

వాసవీభవన్‌లో..

మండల కేంద్రంలోని వాసవీభవన్‌లో వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వాసవీక్లబ్ జిల్లా గవర్నర్ వంగవేటి వెంకటగురుమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాపర్తి మణికంఠ కుమార్, చక్కా కిశోర్, ఆర్యవైశ్య ప్రముఖులు కందిబండ సత్యనారాయణ పాల్గొన్నారు.

నడిగూడెం : మండల పరిధిలోని బృందావనపురంలో గణేషుడి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బీఎస్పీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లుట్ల శ్రీను పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు నేలమర్రి శ్యామ్, భీమయ్య, కృష్ణ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని సీతరాంపురం, లింగగిరి గ్రామాల్లో గణేశ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, సర్పంచులు అద్దంకి సైదేశ్వరరావు, కర్నాటి అంజిరెడ్డి, కమిటీ సభ్యులతో కలిసి



హుజూర్‌నగర్ : అన్నదానం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కట్టా గోపాలరావు, ఉపసర్పంచ్ జానకిరాములు, వార్డు సభ్యులు వసంత, మల్లమ్మ, నాగమణి పాల్గొన్నారు.

కోదాడరూరల్ : పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని 31వవార్డు తిపిరిశెట్టి రామయ్య వీధిలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, వార్డు కౌన్సిలర్ తిపిరిశెట్టి సుశీలరాజు పాల్గొన్నారు.

గానుగుబండలో అన్నదానం

గరిడేపల్లి : మండలంలోని గానుగుబండ బస్టాండ్ వద్ద ప్రతిష్టించిన గణేష్ విగ్రహం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్ఐ వెంకట్‌రెడ్డి ప్రారంభించారు.

ఘనంగా గణనాథుడి శోభాయాత్ర

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో గణేష్ శోభాయాత్రలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం కృష్ణానదిలో గణనాథులను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు కొణతం సత్యనారాయణరెడ్డి, నాగండ్ల శ్రీధర్, జంగారావు తదితరులున్నారు.

అన్నదానం కార్యక్రమం..

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజు ఆదివారం పట్టణంలోని 5వ వార్డు నర్సయ్యగూడెంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం

చిలుకూరు : మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఆదివారం గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.



హుజూర్‌నగర్ : గణేశ్ శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు



మునగాల : కలకోవలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ లోకేష్



కోదాడరూరల్ : అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్



చిలుకూరు : గణనాథుడి నిమజ్జనంలో డ్యాన్స్ చేస్తున్న మహిళలు

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



అనంతగిరి : ఖానాపురంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

అనంతగిరి : ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఖానాపురంలో గణేశ్ నవరాత్రుల్లో భాగంగా ఏర్పాటు చేసిన మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గింజుపల్లి రఘు, ఉపసర్పంచ్ ఎలూగూరి సైదమ్మ, మాజీ ఎంపీటీసీ సామపంగు నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

చిలుకూరు : మండలంలోని బేతవోలు, చిలుకూరు గ్రామాల్లో గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో ఆదివారం ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ్ దంపతులపై విమర్శలు అర్థరహితం

మునగాల : బీఆర్‌ఎస్ మండల నాయకులు టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఎస్.పద్మావతిపై చేసిన ఆరోపణలు అర్థ రహితమని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మండవ చంద్రయ్య ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ ఆధ్వర్యంలో సాగర్ ఎడమకాలువ పరిధిలోని మొదటి జోన్‌కు నీటిని విడుదల చేయాలని ధర్నా చేపడితే ఎన్నికల స్టంట్‌గా బీఆర్‌ఎస్ నాయకులు అభివర్ణించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా ఉన్న అజయ్‌కుమార్ రైతుల పక్షాన మాట్లాడకుండా రాజకీయ కోణంలో ఉత్తమ్ దంపతులను విమర్శించడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ మండల నాయకులు ఉత్తమ్ దంపతులపై అసత్యపు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన అన్నారు. ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0లో భాగంగా పట్టణంలోని 26వ వార్డులో స్వచ్ఛ ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక ఎన్నెస్పీ కాలువలో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలను, చెత్తను, పెరిగిన పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. అనంతరం జేసీబీ సహాయంతో కాలువలో పూడిక తీయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు వ్యర్థాలను మున్సిపల్ సిబ్బంది వచ్చినప్పుడు వారికి అందజేసి స్వచ్ఛ హుజూర్‌నగర్‌కు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు, మేనేజర్ యాకుబ్ పాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఆర్‌పీలు, పురపాలక, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నారాయణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ ఉత్తమ్, తదితరులు

పాలకవీడు : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ బైరెడ్డి రాఘవరెడ్డి సతీమణి నారాయణమ్మ గుండెపోటుతో శుక్రవారం మృతి చెందింది. దీంతో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం నారాయణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, జితేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, మోతీలాల్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.